# మేలు చేసిన రిహార్సల్

-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి



ఆదివారం ఉదయం ఎనిమిదిగంటలైంది. అది చలికాలం. సూర్యరశ్మి వెచ్చదనం అందరికీ హాయిని కలిగిస్తోంది. అది ఊరి బయటి ప్రాంతం.

"కాపాడండి...కాపాడండి" అని కేకలు పెడుతోంది ఒక యువతి.

"కేకలు పెట్టకుండా నీ మెడలో గొలుసు, చేతి ఉంగరం వెంటనే తీసి నాకిచ్చేయ్. లేదంటే ఈ కత్తితో నిన్ను పొడిచేస్తాను" అని బెదిరిస్తున్నాడు ఒక దొంగ.

ఇంతలో అక్కడికి ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు పోలీసులు పరుగున వచ్చారు.

"నీ చేతిలో కత్తిని కిందపడేయ్. లేదా నా రివాల్వర్ గుండు నీ గుండెలోకి దూసుకుపోతుంది" అని హెచ్చరించాడు ఇన్‌స్పెక్టర్. వెంటనే ఆ దొంగ కత్తిని అక్కడ పారేసి వెనక్కి చూడకుండా పారిపోయాడు.

"శభాష్! రాజా నటుడంటే నువ్వేనోయ్. నిజంగా ఇన్‌స్పెక్టర్ వేషంలో నువ్వు జీవించావు. ఆ దొంగను భలే హడలగొట్టి పరుగెత్తించావు" అన్నాడు అప్పుడే అక్కడికి వచ్చిన నాటక కంపెనీ డైరెక్టర్ భూషణం.

ఆ యువతి ఆయన మాటలను విని తెల్లబోయింది.

రాజా వైపు తిరిగి "అయితే సార్ మీరు నిజంగా ఇన్‌స్పెక్టర్ కారా? ఈ పోలీసులు కూడా..." అంది ఆశ్చర్యంగా.

"నేను ఇన్‌స్పెక్టర్ని కాను, వాళ్ళు పోలీసులూ కారు. ఒక నాటకంలో నేను ఇన్‌స్పెక్టర్ గాను, రఘు, రవి పోలీసు పాత్రలలో రిహార్సల్ వేసుకుంటున్నాం. ఇంతలో "కాపాడండి, కాపాడండి" అని నీ కేకలు వినబడి వెంటనే ఇక్కడికి వచ్చాం. నేను ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లోను, వాళ్ళు పోలీసు యూనిఫాంలో ఉన్నాం కాబట్టి నాకు మనసులో స్ఫురించిన ఉపాయం ప్రకారం వాళ్ళతో కూడా ఇక్కడకు వచ్చి నా డమ్మీ రివాల్వర్‌తో ఆ దొంగను బెదిరించాను"

"థ్యాంక్యూ సార్. సమయానికి దేవుడు లాగా వచ్చి ఆ దొంగ నుంచి నన్ను కాపాడారు"

"ఇట్సాల్‌రైట్" అన్నాడు రాజా.

"నీ పేరేమిటమ్మా?" అడిగాడు భూషణం.

"వాణి"

"ఊరు బయటకు ఒంటరిగా వచ్చి ఈ దొంగ చేతిలో చిక్కడం ఎలా జరిగింది?"

"నేను నా ప్రక్క ఇంట్లో రాణి, ఎదురింట్లో సుధ, ముగ్గురం కలిసి జాగింగ్‌కు వెళ్ళి వస్తూంటాం. కానీ ఈరోజు నేను ఆలస్యంగా నిద్రలేచాను. అందుకు రాణి, సుధా నాకంటే ముందుగా జాగింగ్‌కు వెళ్లి వచ్చారు. తరువాత నేను ఒంటరిగా జాగింగ్‌కు వెళ్లి వస్తున్నప్పుడు ఈ దొంగ కంటపడ్డాను"

"ఓ.ఐ.సీ., జరిగిందంతా ఒక పీడకల అనుకో. నేను సరస్వతి నాటక కళాసమితి డైరెక్టర్‌ని. మా నాటకంలో హీరోయిన్‌గా వేయడం నీకిష్టమేనా?"

"నాటకాలలో నటించడం నా హాబీ. నేను కోరుకున్నదే మీరిస్తానంటున్నప్పుడు నాకంతకంటే ఏంకావాలి? మీ నాటకంలో హీరోయిన్‌గా వేయడం నాకు మనస్ఫూర్తిగా ఇష్టమే"

"నాకు చాలా సంతోషంగా వుందమ్మా. నీ పర్సనాలిటీ, అందం హీరోయిన్ పాత్రకు చక్కగా సరిపడతాయి"

"థాంక్స్" అంది వాణి సిగ్గుపడుతూ.

"సరే, ఇప్పుడు నిన్ను మీ ఇంటి దగ్గర దిగబెట్టి వెళ్తాం"

"ఓ.కె సార్. మీరంతా మా ఇంట్లో టీ తీసుకు వెళ్లాలి"

"తప్పకుండానమ్మా" అని అన్నాడు భూషణం.

రాజా, రఘు, రవి తమ మమూలు దుస్తులు వేసుకుని భూషణంతో కలిసి వాణి ఇంటికి వెళ్లారు. వాణి వాళ్ళందరిని తన తల్లిదండ్రులకు పరిచయం చేసి జరిగిందంతా చెప్పింది. వాళ్లు చాలా సంతోషించారు.

కాఫీలయిన తరువాత వాణి తండ్రి గోపాలం "మా అమ్మాయికి చిన్నప్పటినుంచి నాటకాలలో వేసే అలవాటుంది. స్కూలు, కాలేజీలలో బహుమతులు కూడా సంపాదించింది"

"మీరు మీ అమ్మాయి అభిరుచిని గుర్తించి ఆవెుకు నాటక కళలో ప్రోత్సహించడం మీ సంస్కారం. ఆమె అదృష్టం" అన్నాడు భూషణం.

"మన పిల్లలు వారికిష్టమైన కళలో పైకి రావడం మనకు సంతోషమే కదండి" అన్నాడు గోపాలం.

"మా సరస్వతీ నాటక కళాసమితి నాటకాలో హీరోయిన్‌గా వేయడానికి మీ అమ్మాయి అంగీకరించింది. మీకు కూడా ఆమె నటించడానికి అభ్యంతరం ఉండదనుకుంటాను"

"మా అమ్మాయి అంగీకారమే నా అంగీకారం"

"ఈరోజున మా డ్రామా రిహార్సల్ మాకు మేలు చేసింది. మీ అమ్మాయితో పరిచయం ఏర్పడి, మా సరస్వతి నాటక కళాసమితికి హీరోయిన్ లభించింది"

"మీ డ్రామా రిహార్సల్ నన్ను దొంగనుంచి కాపాడి నాకు కూడా మేలు చేసింది" అన్నది వాణి.

"ఇది మీకు, మాకు కూడా మేలు చేసిన రిహార్సల్" అని నవ్వుతూ అన్నాడు గోపాలం.

★